# భవతీ భిక్షాందేహి

సినారా



## ఇల్లిందల సరస్వతీదేవి

"భవత్ భిక్షాందేహి"

తడకతో కట్టిన గేటు పక్కకు జరిపి ఆవరణంలో అడుగుపెట్టిన కృష్ణమోహను రెండు పక్కలా విరియబూసిన ముద్దబంతి చెట్లను కన్నులపండువుగా చూస్తూ, వాటిమధ్య వేసిన సంక్రాంతి ముగ్గులనూ గొబ్బెమ్మలనూ తొక్కకుండా పక్కకు తొలగి' సింహద్వారము సమీపిస్తున్న కొలదీ అడుగులు మందంగా వేస్తూ వచ్చి చావడిలో నిలబడ్డాడు.

పన్నెండు సంవత్సరాలు వెళ్ళీ వెళ్ళని కృష్ణమోహన్ మెరుగు ఛామనచాయలో కళగల ముఖంతో చూపరులను ఇట్టే ఆకర్షిస్తాడు చురుకైన కళ్ళు. అతడి ముఖం చూడగానే ఎవరికయినా వెంటనే పలకరించాలనిపిస్తుంది. చిన్న లాగు

వేసుకొని దానిమీద లుంగీకట్టుకున్నాడు. అంచులేని తువాల ఒకటి బనియన్ మీదుగా కప్పుకున్నాడు. ఎడమచేతికి జోలె తగిలించుకున్నాడు.

"భవతి భిక్షాం దేహి"

అతడు వచ్చిన ఐదు నిమిషాలు కావచ్చింది. మనిషి అలికిడిలేదు. వెనక్కి తిరిగి అతడు సింహద్వారం దాటుతున్నాడు.

"అదేమిటోయ్! అలా అప్పుడే వెళ్ళిపోతున్నావేం? ఒక్క నిమిషం ఉండు" తాడుతో కట్టిన కళ్ళజోడు ఫాలభాగం మీదికి ఎత్తి పట్టుకొని లెక్కల దస్త్రం పక్కకు నెట్టి లేచి లోపలికి వెళ్లాడు కరణం కోటయ్య.

"ఆ అబ్బాయి వచ్చి ఎంతసేపు నిలబడతాడు? అతడు స్కూలుకు వెళ్లే పిల్లవాడు కదా – ఆ పెట్టే ముద్ద తొందరగా పెట్టి పంపించగూడదూ?" కోటయ్య వేస్తున్న కేకలు వాకిట్లోకి వినబడుతున్నాయి.

కృష్ణమోహన్ వెనక్కి తిరిగి చావడిలోకి వచ్చేసరికి కోటయ్య పెద్ద కూతురు ప్రమీళ ఒక పెద్ద పళ్లెంలో పట్టెడన్నం కాస్తకూర పచ్చడిపెట్టుకుని ధుమధుమ లాడుతూ వచ్చింది. తండ్రి పెట్టిన చివాట్లతో కలిగిన కోపావేశంవల్ల ఒణుకుతున్న శరీరంతో గబగబా అడుగులు వేస్తూ ధూకుడుగా వచ్చింది. తల వంచుకుని ఓరగంటతో అతడిని చురచురా చూస్తూ పళ్లెంలో ఉన్నవి జోలిలోకి నెట్టి వెనక్కి తిరిగింది.

"అతడు కాసేపు నిలబడితేనేం? సన్నగా పిలుస్తాడు. ఎవరూ పలక్కపోతే వెళ్ళిపోతాడు. అన్నం కోసం వచ్చిన వాడు కాసేపు నిలబడితే తప్పా? అతడంత గుఱ్ఱమెక్కి వస్తే ఎవరు వణుక్కుంటూ పెడతారు?" తండ్రి మీద విసుక్కున్నది ప్రమీళ.

"అది కాదమ్మా. అతడు చదువుకునే పిల్లవాడు. నాలుగిళ్ళల్లో తెచ్చుకుని ఒకచోట కూర్చుని తినాలా? పుస్తకాలు సర్దుకుని వేళకు స్కూలుకు వెళ్ళాలా! మనం పెట్టదలచుకున్నది ఏదో అతడు రాగానే మర్యాదగా పెడితే ఏం? మనం పెట్టే ఆపట్టెడన్నం అతడిని అరగంట నిలబెట్టి, ధుమధుమలాడుతూ మనసులో నాలుగు తిట్టుకుంటూ పడేస్తే ఏంబాగుంటుంది?" గట్టిగా మందలించాడు కోటయ్య కూతుర్ని.

"అతడి మాట వినగానే పళ్ళెం తీసుకుని వస్తునే ఉన్నాను నాన్నా. అతనువచ్చి ఎంతసేపయినట్టూ. ఎవరూ పలకనట్టూ అతడు అలా వెళ్ళిపోవటమేమిటి బెదిరించినట్టుగా? ఎవరిని భయపెడదామని? ఎవరిని సాధిద్దామని?" కోపం ముక్కుమీద పెట్టుకొని గలగలా అరచింది ప్రమీళ.

"ఒకరిని భయపెట్టాలనికాదు. అతడెంతో అభిమానంగల కుర్రవాడు. మన యింటికి జోలెతీసుకుని రావటమే సగం చచ్చి వస్తున్నాడు, రాగానే పెట్టదలచిన దేదో ఆదరణతో పెట్టి పంపగూడదూ? మీసొమ్మేమయినా తరిగిపోతుందా?"

"ఏమో నాన్నా. ఎవరో జోలెకట్టుకుని వచ్చిన వాడికికూడా వణకమంటావు నీవు" తలుపులు ధనధన శబ్దము చేస్తూ లోపలికి వెళ్ళిపోయింది ప్రమీల.

హాల్లో అరుచుకుంటున్న తండ్రీ కూతుళ్ళ మధ్య ఘర్షణ బంతిచెట్లమధ్య నడుస్తున్న కృష్ణమోహన్ చెవిన పడ్డది. రోషమూ అభిమానమూ ముఖంలో తొంగిచూశాయి. గబగబా అడుగులు వేస్తూ కర్రగేటు దాటాడు. జోలెలో ఉన్న అన్నం కూర పప్పు గోడవారగా దులిపాడు విసురుగా. అంతకుముందు. రెండు ఇళ్ళల్లో తెచ్చుకున్న పదార్థాలు అన్నీ ముద్ద కట్టుకొని కిందపడ్డాయి. కసికొద్దీ జోలి నాలుగుసార్లు ఝాడించాడు. దానివంక అదోక మాదిరి జుగుప్సతోచూసి మురికి కాలువలోకి విసిరివేసి గంగరాజువారి వీధి దాటాడు.

ఉదయం తొమ్మిది గంటలవేళ. ఆ చుట్టుపక్కల ఉన్న తోటలలో నుండి కూరగాయలు తెచ్చి రాసులుగా పోస్తున్నారు. వాటిని బళ్ళకెత్తి వ్యాపారస్తులు పొరుగూరుకు పంపుతున్నారు. పెరుగు తలమీద పెట్టుకొని ఒయ్యారంగా గొల్ల పడుచులు నడుస్తున్నారు. పొరుగూళ్ళకు వెళ్ళి వ్యాపారం చేసేవారు, స్కూళ్ళకు వెళ్ళే పిల్లలు, కార్యార్థులై ఇటూ అటూ తిరిగే జనంతో ఆవీధిలో క్రమంగా రద్దీ ఎక్కువవుతున్నది. అందరికీ తొందర పనులు..పరుగు లాంటి నడకలు. ఆ ఊరు తెల్లవారు ఝామున నాలుగింటికే మేలుకుంటుంది. సూర్య భగవానుడి నడకతో పాటు క్రమంగా సందడి అధికమవుతూ వుంటుంది. ఆ ఊళ్ళో రద్దీగా ఉండే బజార్లు నాలుగు. ఆ నాలుగూ తప్పితే మిగతావన్నీ బద్ధకంగా ఆవలిస్తున్నట్లుంటాయి.

రద్దీ బజార్లన్నీదాటి కృష్ణమోహన్ విసురుగా గదిలోకి వచ్చాడు.

"వట్టిచేతులతో వచ్చావేమోయ్? ఎక్కడయినా తిని వచ్చావేమిటి?" హోటల్లో భోజనంచేసి వచ్చిన సూర్యం అతడిని అడుగుతూ షర్టు తొడుక్కున్నాడు.

కృష్ణ మాట్లాడకుండా ముక్కుపుటాలెగురవేస్తూ లుంగీ విప్పి పాయజామా తొడుక్కున్నాడు, మేకుకు తగిలించిన షర్టుతీసి ఒకసారి దులుపుకొని తొడుక్కున్నాడు.


భోజనం చేసి వచ్చావా అంటే మాట్లాడవేం?" గద్దించి అడిగాడు సూర్యం.

"ఇవాళ ఆకలిగా లేదు" ముఖం తిప్పుకున్నాడు కృష్ణ.

"ఆకలిగా లేకపోతే గదిలోనుంచి ఎందుకు బయలుదేరావు? ఏదీ నాముఖం చూసి చెప్పు?" విసురుగా వచ్చి రెండు చేతులతో కృష్ణను తన వైపుకు తిప్పుకుని అతడి కళ్ళల్లోకి సూటిగా చూశాడు. సూర్యం.

తెచ్చుకున్న గాంభీర్యంతో బింకంగా నిలబడ్డ కృష్ణముఖంలో దైన్యం తొంగి చూసింది. కళ్ళల్లో నీళ్లు సుళ్ళుతిరిగాయి.

చటుక్కున జేబులు తడుముకున్నాడు సూర్యం, "లక్ష్మీపతి నీ దగ్గరేమయినా చిల్లరడబ్బులుంటే ఇట్లాయివ్వు "చెయ్యి




జాసాడు.

నోట్ బుక్కులు కొందామని జేబులో పెట్టుకున్నా తీసుకో" జేబులో ఉన్న చిల్లర సూర్యం చేతిలో పెట్టాడు లక్ష్మీపతి.

"పద. మాట్లాడకుండా నా వెంటనడు" కృష్ణ చెయ్యిపట్టుకుని భోజనం హోటలుకు తీసుకువెళ్లాడు సూర్యం.

బల్లముందరికి రాగానే "నాకేమీ ఒద్దంటే విను సూర్యం – "చేతులు విదిలించుకున్నాడు కృష్ణ.

ఈ పూటకు నేను చెప్పినట్టు విను. అయినా కడుపు మాడుతుంటే పాఠాలు బుర్రకెక్కుతాయా? నువ్వు మాట్లాడకుండా నేను చెప్పినట్లు చెయ్యి. రెండు చేతులతో కృష్ణభుజాలు అదిమిపెట్టాడు.

కృష్ణకు అభిమానంతోనూ రోషంతోనూ దేహమంతా కాగిపోతున్నది. సూర్యం బలవంతంచెయ్యటంతో విసుగు కూడా వచ్చి కలిసింది. కొంతసేపు సూర్యంతో పెనగులాడాడు.

"ఏమిట్రా నీ పెనగులాట? ముందు భోజనం చెయ్యి." వీపుమీద చెయ్యివేసి బలవంతంగా అణచి కుర్చీమీద కూర్చొబెట్టాడు సూర్యం.

రాలబోయే కన్నీళ్ళను కనురెప్పలతో అణచుకుంటూ భ్రూకుటముడిచాడు కృష్ణ.

"కడుపు నిండా తిను. నే నింత కష్టపడి కూర్చొబెడితే నీవు అర్థాకలితో లేవకూడదు మరి." కృష్ణ వీపుమీద చెయ్యివేసి మందలించాడు సూర్యం.

"వి స్తరిముందుకు వచ్చే సరికే నాకు

కడుపు నిండిపోయింది సూర్యం. నీవు ఏమీ అనుకోకు" కళ్ళు తుడుచుకుంటూ లేచాడు కృష్ణ.

"నాకంతా అర్థమయిందిలే. సాయంత్రం స్కూలునుంచి వచ్చిన తరువాత మాట్లాడుకుందాములే" ఇద్దరూ లేచి హాలు దాటి గదికి చేరుకున్నారు.

సాయంత్రం సూర్యం ఆలస్యంగా వచ్చాడు. కృష్ణను తనతోపాటు హోటలుకు తీసుకు వెళ్ళాడు. బలవంతంగా కృష్ణచేత అన్నం తినిపించాడు. నేరస్థుడిని పోలీసు వెంటబెట్టుకుని తిరిగినట్టు తిరిగాడు. ఈ తాటాకుల చాపమీద కృష్ణ కూర్చుని చదువుకుంటుంటే తనుకూడా అతని పక్కన కూర్చుని పుస్తకాలు తెరిచాడు. కృష్ణ లక్ష్మీపతి పడుకున్న తరువాత తండ్రికి తను వ్రాసిన ఉత్తరం జేబులోనుంచితీసి చదువుకున్నాడు.

మ. నాన్నగారికి.

నమస్కారములు. నేను క్షేమంగా ఉన్నాను. నిరుటికంటె బాగా చదువు తున్నాను, కాని నాకు హోటలు భోజనం సరిపడటం లేదు. మరీ ఆ చప్పటి భోజనం చెయ్యలేకుండా ఉన్నాను. సోడానీళ్ళు పోసి వండిన ఆ అన్నం చూడటానికి మల్లెపూలలా ఉంటుంది. కానిముద్దకు గ్లాసెడు నీళ్ళు తాగవలసి వస్తోంది. నా ఆరోగ్యం చెడిపోతుందేమోనని భయం వేస్తున్నది. మీరుబియ్యం పప్పు చింతపండు మిరపకాయలూ మన వెంకన్నచేత పంపిస్తే స్టౌవ్‌మీద అన్నం కూర చేసుకుంటాను. ఊరగాయలు పంపించండి. ఈ ఊళ్లో ఉన్నంతకాలం ఇలా వండుకుని తింటేగాని నేను పరీక్ష ప్యాసుకాలేననిపిస్తోంది. తప్పకుండా వెంకన్నతో సరుకు పంపించండి. అమ్మగారికి నా నమస్కారములు. పద్మకు ముద్దులు.

ఇట్లు
మీ ప్రియ కుమారుడు
సూర్యనారాయణ

తిప్పితిప్పి ఉత్తరం చదువుకుని జేబులో పెట్టుకున్నాడు సూర్యం." నాన్న తప్పకుండా పంపుతారు. మరో దోసెడు బియ్యం పోస్తే కృష్ణకు కడుపు నిండుతుంది." కళ్ళు మూసుకుని నిద్ర పోవటానికి ప్రయత్నించాడు సూర్యం. పక్కమీద వాలేడో లేదో చటుక్కున ఏదో జ్ఞాపకం వచింంది. మరునాటికి హోటలు ఖర్చు ఉన్నదో లేదోనని చివాలున లేచి జేబులు తడిమి చూసుకున్నాడు హోటలుకు తను నెలకు ఒక్కసారే కట్టేస్తాడు. లక్ష్మీపతి వాళ్ళబంధువుల యింట్లో నెలకు ముప్పయి రూపాయలు యిచ్చి తినివస్తాడు. అతడిని గురించి ఏమి బాధలేదు. కాని కృష్ణను గురించే ఆరాటంగా ఉన్నది. కృష్ణ తెలివితేటలూ అతడి చురుకైన బుద్ధీ, అతని మంచితనమూ చూసినప్పటి నుంచీ అతడు తనకు తోడ బుట్టినవాడు కాకపోతే నేం — తమ్ముడి కంటె ఎక్కువ అని మనసు కొట్టుకుపోవటం మొదలు పెట్టింది, కృష్ణా. కృష్ణా అని మనసులోనే ప్రేమతో పిలుచుకుంటూ గాఢంగా అతనిని కౌగలించుకున్నాడు సూర్యం.

జేబులో చెయ్యిపెట్టి డబ్బుపైకి తీసి

లెక్కపెట్టాడు. పావలా తక్కువగా ఉంది. రేపు పొద్దున్న తొమ్మిదిగంటల వరకూ ఒక్క పావలా పుట్టించ లేనా ఏమిటి? ఇంతమంది క్లాసుపిల్లలు — తెలిసినవాళ్ళు - అభిమానస్తులు ఉండగా ఒక్క పావలా డబ్బులు దొరకవా? పావలా ఎట్లాగయినా సంపాదించాలి? పావలా దొరక్కపోతే కృష్ణకు భోజనం లేదు. అతడి కడుపు నకనకలాడుతుంటే తను తినలేడు. ఆలోచిస్తూ పడుకున్నాడు సూర్యం.

పావలా....ఒక్కపావలా....ఎప్పుడో కళ్ళు మూతలు పడ్డాయి.

ధాతలయిన శ్రేష్ఠి కుటుంబీకులు మార్కెటు దగ్గరగా సేవకదాసు మఠం కట్టించారు. నాలుగు ప్రక్కలా పెద్దపెద్ద గదులూ వాటిముందు విశాలమయిన వరండాలూ, వాటిమధ్య ఖాళీస్థలంలో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహము దాని కాక ఎన్న గుడికట్టారు. వీరాంజనేయ స్వామికి నిత్య ధూపదీప నైవేద్య పూజా క్రమమే కాకుండా వైశాఖ పూర్ణిమకు పెద్ద ఎత్తున రథోత్సవాలు జరుగుతూ ఉంటాయి. ఉత్సవవిగ్రహాలు, పాత్రసామగ్రితో రెండుగదులు నిండి ఉంటాయి. మిగతా గదులు భక్తులకొరకు ప్రత్యేకింపబడ్డాయి. వీరాంజనేయస్వామి గుడికి వెనుకగా పెద్దమర్రిచెట్టొకటి ఊడలు దిగి ఉన్నది. దాని నీడ ఆచుట్టుపక్కల అంతా పరుచుకుని ఉంటుంది. పర్వదినాలు కాక మామూలు రోజుల్లో ఆవరండాలో మధ్య ఖాళీస్థలమూ ఊరికెనే ఉంటుంది. మఠాధికారులు అప్పుడప్పుడు పెళ్ళిళ్ళకు అద్దెకివ్వటంకూడా అలవాటు.

అది కార్తీక మాసం. కార్తీకంలో కన్యాదానంచేస్తే మహాపుణ్యమని కార్తీక పురాణం చెబుతున్నది. ఆ నెలలోనే ముహూర్తాలు ఉదయం సాయంత్రమూ ముమ్మరంగాజరుగుతున్నాయి. రాయవరం దక్షిణామూర్తి కార్తీకమాసంలో జరిగిన ప్రతి పెళ్ళికీ హాజరయ్యాడు. నూరు రూపాయల సంభావన మూటకట్టుకున్నాడు. పెళ్ళిళ్ళ తరుణముఅయిపోగా నేతన మామూలు వృత్తియాయ వారంలోకి దిగాడు. తెల్లవారు ఝామునే లేచి రాగి చెంబు ఎర్రగా తోమాడు. స్నానం చేసి సీతారామాభ్యాన్నమః అంటూ బయలు దేరాడు.

అంగవస్త్రం వల్లెవాటుగా వేసుకుని రాగిచెంబు చేతపట్టుకుని వచ్చిన దక్షిణామూర్తిని చూసి 'శాస్త్రుల్లూ' అన్నాడుదేవాలయ ధర్మకర్త అచ్యుతరామయ్య.

"ఏంబాబూ? ఏం సెలవు?" అన్నాడు చేతులుజోడించి దక్షిణామూర్తి.

"ఈచెంబు తీసుకునిపొద్దున్నే అందరిళ్ళకూ వెళ్ళలేదని పించుకోకుండా ఒక ఉపాయం చెప్పనా?" దక్షిణమూర్తి ముఖంలోకి చూసాడు అచ్యుతరామయ్య. చెప్పండిబాబూచెప్పండి. ఎన్నిఇళ్ళు తిరిగితే శేరుబియ్యమవుతాయి బాబూ? మరొకదారి లేక - ఎక్కడా గతి లేక - ఈచెంబు వృత్తికి దిగాను" అన్నాడు తలవంచుకుని.

"మావర్తకుల పిల్లలను మీదగ్గరకి

పంపిస్తాము. అక్షరాభ్యాసము చేసి అయిదు బడులు చెప్పండి మీకు వచ్చినలెక్కలన్నీ నేర్పండి. పెద్దబాలశిక్ష ముగించండి. పిల్లకి ఐదు రూపాయల వంతు న నేనిప్పిస్తాను. మీరు అక్షరాభ్యాసము చేసినప్పుడు మీకు కట్నకానుకలు సమర్పిస్తారు. నేను చెప్పినట్టు చేస్తారా? అన్నాడు తర్జని ఆడిస్తూ అచ్యుతరామయ్య

"బాబ్బాబూ. అంతకంటె నాకుకావలసిన దేమున్నది! ఈ పేదవాడిని సేటుగారిపంచలోనే వంట, పడక! అంటాను. మరి ఈ పిల్లలందరిని ఎక్కడ కూర్చోబెట్టుకోను?

"నేను చెప్పేది సాంతంగా వినండి. మావర్తకులలో కొందరు సేవకదాసు మఠానికి ధర్మకర్తలు. మఠం వరండాలో పిల్లలను కూర్చోబెట్టుకోండి. ఈఏర్పాటు మీకు నచ్చితే నేను సాయంత్రానికల్లా సిద్ధం చేస్తాను"


"బాబూ, ఇవాళ దేవుడు నన్ను అనుగ్రహించి ప్రత్యక్షమయి ఏంవరం కావాలో అడుగు అన్నట్లుగ ఉంది మీరుపదికాలాలపాటు సిరిసంపదలతో తులతూగాలని కోరుకుంటాను. పేదవాడిని-అంతకంటే యింకేం చెయ్యగలను?" నీళ్లు నిండిన కళ్ళతో తలకు దోసిలి కట్టాడు,

"చెయ్యిపట్టండి" అచ్యుతరామయ్య దక్షిణామూర్తి శాస్త్రి చేతిలో పావలా కాసు పెట్టాడు.

ఆయన దాన్ని కళ్ళకు అద్దుకుంటూ "బాబూ వెళ్ళి వస్తాను" వెనక్కు అడుగులు వేసుకుంటూ వెళ్ళి దరవాజాదగ్గర మలుపు తిరిగాడు.

వైకుంఠ ఏకాదశి రేపనగా అచ్యుతరామయ్య ఇరవైమంది పిల్లలను తీసుకు వచ్చాడు. ఉదయం ఎనిమిది గంటలకు రాహుకాలం దాటిన తరువాత పిల్లలు తీసుకువచ్చిన పూజా ద్రవ్యాలతో విఘ్నేశ్వరునికీ సరస్వతీ విగ్రహానికీ పూజలు చేయించాడు. పిల్లలందరూ గురువుకు దక్షిణ తాంబూలాలు సమర్పించారు. ఆపూట పదిమందికి అక్షరాభ్యాసం చేశాడు దక్షిణామూర్తి శాస్త్రి.

ఉదయం పొద్దుపొడవక పూర్వమే లేచి సంధ్యా వందనాదులు తీర్చుకొని ఉతికిన ధోవతి కట్టుకొని. సన్నటి ఉత్తరీయం వల్లెవాటు వేసుకొని, సేవకదాసు మఠంలో వరండామీద గోడకానుకుని కూర్చుని, ధ్యానశ్లోకాలు వల్లించుకుంటూ ఉంటాడు. ఎనిమిది గంటలు



కొట్టేసరికి ఒక్కొక్క విద్యార్థి వచ్చి ఆయనకు పాదాభివందనంచేసి పరచిన చాపలమీద కూర్చుంటారు. ఉదయం ఎనిమిది గంటల నుండి పది గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకూ స్కూలు నడుస్తుంది. తరువాత పిల్లలను జాగ్రత్తగా బైటకిపంపించి తన ఇంటికి చేరుకుంటాడు శాస్త్రి. ఆ చుట్టుప్రక్కల ఉన్న ఇళ్ళకు పిల్లలు క్షేమంగా రెండు నిమిషాలలో చేరుకునేవారు.

శాస్త్రికి సంగీత జ్ఞానము ఉన్నది. కొన్ని కీర్తనలు కృతులుకూడా శాస్త్రయుక్తంగా గానం చెయ్యగలడు. పాఠశాల పెట్టిన కొద్దిరోజులకె శాస్త్రిగారి సంగీతం సంగతి పిల్లల తల్లిదండ్రులకు తెలిసింది. ఇంటికిపిలిచి ఆడపిల్లలకూ భార్యలకూ సంగీతం చెప్పమని అడిగారు. ఇంటికొక హార్మోనియము కొనుక్కున్నారు.

కృష్ణార్పణమస్తు అంటూ శాస్త్రి సంగీతపాఠాలుకూడా చెప్పటం మొదలు పెట్టాడు. ఆయన భార్య పుష్పవతమ్మ కాన్సు ఇంటికి నిండుగా చీరరవికధరించటమూ దంపతులిద్దరూ కడుపునిండాతిని త్రేన్పటం మొదలయింది. ఆయన జీవితంలో అప్పటినుండి అదృష్టం కలిసి వచ్చిందన్న నమ్మకం ఏర్పడిపోయింది.

ఈ విధంగా ఆయన దగ్గర పెద్దబాలశిక్ష, గజేంద్ర మోక్షం కృష్ణ శతకం, బాలరామాయణం చదువుకుని హైస్కూలులోకి వచ్చిన మొదటి విద్యార్థి సూర్యనారాయణ సెలవుల్లో ఇంటికి, వచ్చినప్పుడు మొట్ట మొదట పంతులుగారిని దర్శించి ఆయన ఆశీర్వచనం తీసుకుంటాడు. డిసెంబరు శెలవులకు ఇంటికి వచ్చాడు సూర్యం. బస్సు ఆ ఊరు చేరుకునేసరికి రాత్రి తొమ్మిది గంటలయింది. ఆ రాత్రి వేళ పంతులుగారి దగ్గరికి రాలేక ఉదయమే స్నానం చేసి వెళ్ళాడు.

శాస్త్రి పంచలో చిరిచాప పరచుకుని పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు. ఆయన కెదురుగా ఏడేళ్ళ పిల్లవాడు కూర్చుని పాఠాలు చదువు తున్నాడు.

కుశలప్రశ్నలూ చదువులసంగతులూ అయిన తరువాత శాస్త్రి "బాబూ. ఒక మాట" అన్నాడు.

లేవబోతున్న సూర్యం తిరిగి కూర్చుని ఏమిటన్నట్లు చూశాడు

"ఈ చిన్న వాడికి ఎవరూలేరు. ఒక నాడు చీకటివేళ నేనుబహిర్భూమికి వెళ్ళి వస్తున్నా కళ్ళనిండా ఇంత నీళ్ళున్న దుమ్ము, మాసిన లాగూ చొక్కా - చేతులతో కళ్ళునులుముకుంటూ ఏడుస్తూ దొంకవెంట నడుస్తున్నాడు. నాతో ఇంటికి తీసుకు వచ్చి నీళ్ళు పోయించి అన్నం పెట్టాను. నీ వంటి పిల్లలచేత బట్టలను యిప్పించాను. అతిచురుకు. పాఠంగానీ శ్లోకాలుగానీ ఒకసారి చెప్ప టంతోటే నేర్చుకొంటాడు. ఈ అయిదు నెలలలోనే నాదగ్గర నేర్చుకోవలసిన దంతా నేర్చుకొన్నాడు." అంగవస్త్రంతో ముఖం కళ్ళూ తుడుచుకున్నాడు.

సూర్యం. ఒకసారి ఆ పిల్లవాడి ముఖంలోకిచూశాడు. అతడు సూర్యాన్ని

చూసి కళ్ళు దించుకున్నాడు. చక్రాల లాంటి అతడి కళ్ళు సూర్యాన్నిచూచి, అతడు తనవంక చూచినప్పుడు దించుకుంటూ తిరిగి తిరిగి అతని ముఖంలోకి చూస్తూ కొంతసేపు దోబూచులాడాయి.

"వేసవి అయిన తరువాత ఏదయినా స్కూలుచూసి అందులో ప్రవేశపెడితే తెలివైన పిల్లవాడుకనుక త్వరగా పైకి వస్తాడు తల్లిదండ్రులెవరంటే స్పష్టంగా చెప్పలేకపోతున్నాడు. ఏ వూరినుంచి వచ్చాడో ఎక్కడినుంచివచ్చాడో సరిగా తెలియని స్థితి. అనాథ బాలుడు."

శాస్త్రి భావం సూర్యం గ్రహించాడు. స్కూళ్ళు తెరవగానే ఆ సమీపంలో ఉన్న స్కూల్లోచేరే, ఏర్పాటు చేస్తానని చెప్పాడు. అలా స్కూల్లో చేరిన కృష్ణమోహను శాస్త్రి కట్టి యిచ్చిన జోలెలో అయిదారు యిళ్ళు తిరిగి అన్నం పప్పు కూర పచ్చడి తెచ్చుకొని రెండుపూటలా అదే సర్దుకుని తినేవాడు. హెచ్చుతగ్గులు శాస్త్రి సర్దేవాడు. ఆపంచలోనే జానెడు స్థలంలో ఒక గోనసంచీ పరచుకుని కాళ్ళు ముడుచుకుని మరొక సంచీ కప్పుకుని కృష్ణమోహన్ పడుకునేవాడు.

కృష్ణమోహన్‌పట్ల సంతానం లేని పంతులుగారు పుత్రవాత్సల్యాన్ని పెంచుకున్నారు అలా ఆ ఊళ్లో శాస్త్రిగారి అండదండలతో మిడిల్‌స్కూలు ముగించాడు కృష్ణ.

సెలవులు పూర్తికాగానే సూర్యం ఊరు వెళ్ళేటప్పుడు గురువుగారివద్ద సెలవుతీసుకోవటానికి వెళ్ళాడు.

"నాయనా సూర్యం. మన కృష్ణ మిడిల్ స్కూలు చదువు ముగిసింది." అన్నాడు తరువాత సంగతేమిటన్నట్టు చూస్తూ.

"ఆ సంగతి ఆలోచిద్దాం లెండి" గురువుగారి మాటల్లోని అర్థం గ్రహించాడు సూర్యం. తగిన యేర్పాటు చేస్తానని హామీ యిచ్చాడు సెలవులు అవగానే కృష్ణను తనవెంట తీసుకువెళ్లాడు చదువుకోసం.

సూర్యందగ్గరికివచ్చిన కృష్ణకు 'భవతీ భిక్షాందేహి' అనటం తప్పలేదు. ఉదయం ఎనిమిది గంటలనుండి తొమ్మిది గంటలవరకూ జోలెచేతికి తగిలించుకుని సూర్యం పరిచయంచేసిన అయిదారిళ్లకు వెళ్ళాడు. అన్నంలో కూర - కూరలో పచ్చడి - పచ్చడిలో పప్పు కలిసినా గదికి వచ్చిన తర్వాత పింగాణీ పళ్లెంలో విడదీసి పెట్టుకుంటాడు. ఆపూటకు కొంతతిని మిగతాది రాత్రికి తింటాడు. సూర్యం గదిలో అతడి సహాధ్యాయి లక్ష్మీపతికూడా ఉంటాడు. వాళ్ళిద్దరూ పడకలు పరచుకున్న తరవాత కృష్ణ గోనెసంచిమీద దుప్పటి పరచుకొని మరో దుప్పటి తలనిండా లాక్కుని పడుకుంటాడు. తెల్లవారుఝామున లేచి పాఠాలు చదువుతాడు. ఆటల్లో ప్రథముడు చదువులో ప్రథముడు. శాంతమూ ఓర్పుగల కృష్ణ "మీ అమ్మా నాన్న ఏ వూళ్ళో ఉంటారు?" అని ఎవరయినా అడిగితే చెంప చెళ్ళుమని పిస్తాడు

ఒక రాత్రివేళ మెలకువ వచ్చిన సూర్యం కృష్ణనుచూసి అతడి భవిష్యాన్ని గురించి ఆలోచించ సాగాడు.

"నన్ను జోల అని పిలుస్తారా? నీపళ్ళు రాలగొడ్తా జాగ్రత్త" కృష్ణ నిద్రలోలేచి కూర్చున్నాడు.

"కల వచ్చిందా కృష్ణా?" దగ్గరికి వెళ్ళి వీపుమీద చెయ్యివేశాడు సూర్యం.

ఎర్రబడిన కళ్ళు తిప్పుతూ కొంత సేపు అయోమయంగాచూసి మళ్ళీ నిద్ర లోకి జారిపోయాడు కృష్ణ

## 3

"కృష్ణా నోరు మండించేశావురా బాబూ" కళ్ళనీళ్లు తుడుచుకుంటూ చెంబెడు నీళ్ళు తాగాడు సూర్యం.

"నీకు నోరుపూసి వుంటుంది. నేను కారం వెయ్యందే ఎక్కడ నుంచి వస్తుంది చెప్పు? లక్ష్మీపతి నీవు చెప్పు. నీకుకూడా కారంగా ఉంటే రేపు ఇంకా తగిస్తాను" కృష్ణ లక్ష్మీపతి బుజమ్మీద తట్టాడు.

"అదిగో రేపు తగ్గిస్తానంటున్నావు అయితే ఇవ్వాళ కొంతవేసినట్లేగా!" సూర్యం రెట్టించాడు.

"నాకుచేతకాదురాబాబూ ఈకూరలు పచ్చళ్ళు నేను ఆయింట్లో, ఆయింటో చేసినవి తిన్నానుగానీ ఎప్పుడు చేశాను చెప్పు? ఊహకొద్ది ప్రయత్నిస్తున్నాను!! అప్పటినుండీ విమర్శలు వీకూరమీద చెలరేగాయో ఆకూర కలుపుకోకుండా పక్కకు నెట్టి మజ్జిగ వడ్డించుకున్నాడు కృష్ణ.

ఓరగంటితో కృష్ణ చేస్తున్న పని చూస్తూనే తల వంచుకున్నాడు సూర్యం.

నాలుగు రోజుల క్రిందట పడుకోబోయేటప్పుడు కృష్ణ "ఎల్లుండి ఆదివారం గోల్కొండకోట గుంబిదులూ అన్నీ విద్యార్థులకు చూపిస్తారు మాస్కూల్లో టీచర్లు. ఒక్కొక్కళ్ళను రెండేసి రూపాయలు తీసుకు రమ్మన్నారు" అన్నాడు సూర్యంతో.

"అట్లాంటి అవకాశాలువచ్చినప్పుడు వదలుకోవద్దు కృష్ణా తప్పకుండా వెళ్ళు. ఆ చారిత్రక ప్రదేశాలన్నీ చూడవలసినదే" సూర్యంలేచి కృష్ణ చేతిలో బలవంతంగా రెండు రూపాయలు పెట్టాడు.

శనివారం రాత్రి కృష్ణ మనసు మరునాడు చూడబోయే వాటిని ఊహించుకుని ఉవ్విళ్ళూరింది తెల్లవారుఝామున లేచి ఉన్నవాటిలో మంచి బట్టలు వేసుకొని స్కూలు పిల్లలందరితో బస్సులో వెళ్ళి గోల్కొండకోట ఎక్కి అక్కడి విశేషాలన్నీ చూశాడు కృష్ణ. కుతుబ్ షాది వంశస్థుల గోరీలన్నీ లెక్కబెట్టాడు. అప్పటివారికి తాము బ్రతికి ఉండగానే తమగోరీలను కట్టించుకునే అలవాటు. కనుకనే తమ ఇష్టం వచ్చినట్లు పెద్ద పెదగోరీలు కట్టించుకున్నారు. ఇప్పటి మానవాళిలో తలదాచుకోవటానికయినా ఇల్లు లేని వారెందరో ఉన్నారు. అనుకున్నాడు కృష్ణ. పిల్లలందరూ కబుర్లు చెప్పుకుంటూ చాలా దూరం నడిచినడిచి ఒక చెట్టునీడన కూర్చుని వెంట తెచ్చుకున్న రొట్టెలు తిన్నారు. కొందరు మంచినీళ్ళకొరకు అటూయిటూ పరు

గెత్తారు. ఎదురుగా నవాబుల తోటలో పాల్సా చెట్లను తొలగించుకుంటూ వెళ్ళి పంపునీళ్ళు చేతులతో తాగి వచ్చారు అందరూ.

నవాబు తోటవంటి తోటలు చాలా అరుదు. ఆ తోటలో అన్ని రకాల పూలచెట్లు అన్ని కరాల పత్తిచెట్లు పుష్పించి ఫలిస్తున్నాయి. వరి, జొన్న, జనుము, గోధుమ ధాన్యాలు పండుతున్నాయి. పాతిక ఎకరాల తోటలో నట్టనడుమ రెండంతస్తుల భవనము. మేడమీదనుండి తోట నాలుగు మూలలూ పరికించి ఎక్కడ ఏం జరుగుతున్నదో తెలుసుకునేవాడు ఆ నవాబు. ఆ తోట పేరు అమీర్ గుల్షన్. కష్టపడి తోటవేసి పెంచి నవాబు మామగారు పెళ్ళిలో అల్లుడికి కానుకగా యిచ్చాడు.

అమీర్‌గుల్షన్ పక్క తోట వరకోటి గారెన్ను. తోట ఇరవైఎకరాలు ఒక పక్క విశాలమయిన భవనం. ఆతోటలో నాలుగు ఎకరాలు పాల్సా - మిగతా పదకొండు ఎకరాలు అనాబ్‌శాహి ద్రాక్ష వేశారు. తోటలోకి కొత్తవాళ్ళు ఎవరూ రాకుండా రెండు అల్సేషియన్‌కుక్కలు. ఈ రెండు తోటలూ దాటిన తరువాత రిటైర్డు రెవిన్యూ సెక్రటరీ పాషాగారి భవనం. దాని తరువాత కిషాస్థాన్ వెళ్ళిపోయిన మహమ్మదీయుల మేడలు రెండు. వాటి తరువాత చౌరాస్తా. చౌరాస్తాకు నట్టనడుమ పోలీసు నిలబడటానికి ఒక సిమెంటు దిమ్మె. రోడ్డుకు రెండు పక్కలా ఇళ్ళులేవు. అక్కడొకటీ - ఇక్కడొక్కటీ చిన్న చిన్న ఇళ్ళు - మధ్యమధ్య పొలాలు - మోటబావులూ ఎలక్ట్రిక్ పంపులూ ఉన్నాయి. జనసందడి తక్కువ. సిటీ నుండి గంటకొకటే బస్సు నడుస్తుంది.

వీటన్నిటికీ కళ్ళు వెడల్పు చేసుకొని చూస్తున్నాడుకృష్ణ. వీటన్నిటినీ ఎప్పుడో ఎక్కడో చూచినట్టుగా మెదడులో అస్పష్టంగా చిత్తరువులు కదిలినట్టుగా కనబడుతున్నాయి.

"అవును - అవును. పోలీసునిలబడే సిమెంటు దిమ్మె కొంచెం విరిగి ఒరిగి ఉండాలి. బస్సుస్టాండు దగ్గర చిన్న టీ హోటలు ఒకటి ఉండాలి. మరి వరకోటీ గారెన్నుకూ పాషా గారింటికీ మధ్య ముళ్ళ తీగె ఉండాలి. ఆమధ్య ఒకచిన్న గుడిసెలాంటి యిల్లొకటి ఉండొద్దూ." తల గోక్కుంటూ ఆలోచిస్తూ పిల్లలతో నడిచి బస్సు ఎక్కాడు.


దీర్ఘ రోగులకు చికిత్స



ఏరోగమైననూ
ఎంత కాలముగా ముదిరిననూ
మా సలహాతో ఆరోగ్యము
పొందుడు

కవిరాజ్ మోహన్.
క్రియాకల్ప ఫార్మశీ & స్టోర్సు, గాంధీనగరం, విజయవాడ-3

మా ఆఫీసు గాంధీనగరంలోగల హోటల్ రాజ్‌మహల్ వద్ద గలదు
రోగులపరీక్ష ప్రతి ఆదివారము మాత్రమే

## అసలైన వెంట్రిలాకిస్టు

వెంట్రిలాకిస్టు:- ఇందాకటినుంచీ మీ రంతా వొకటే గలభా, రాని తుమ్ములూ నూ. ఇప్పుడు నేను వరసనే చెప్పనా, యే మూలనుంచి యే రకం జనం తుమ్మిందీనీ.

ఫ్రంటు రోలో తుమ్మినాయన డెంటిస్టు
ఆ మూలసీటులో తుమ్మిన మిత్రుడు టైపిస్టు,
నేలనుంచి తుమ్మిన తండ్రి సోషలిస్టు'

సభికులు : భో, మెచ్చాం, నీ వసలైన వెంట్రిలాకిస్టువయ్యా!

ఆ ప్రదేశాలన్నీ తను చూసినట్టున్నా ఏమిటి? ఎప్పుడో? ఎవరితో?'

పిచ్చిపిచ్చి చూపులతో కృష్ణ గదికి చేరుకుని మామూలుగా పొయ్యివెలిగించి వంటచేశాడు. అతడి బుద్ధితీరిక దొరికి నప్పుడల్లా ఆలోచిస్తునే ఉన్నది ఎప్పుడు? ఎక్కడ? ఎవరితో? ఈ ప్రశ్నలకు జవాబు దొరకటంలేదు. బుద్ధి ఎక్కడో విహరిస్తూ ఉండటంవల్ల కూరలో ఎంత కారం వేశాడో అతడికే తెలియకుండా పోయింది.

### 4

పిల్లల వార్డులో అమ్మా అమ్మా అని పిల్లలంతా అనూరాధ చుట్టూ మూగుతూ చేతిలో ఉన్న బిస్కట్లు అందుకుం టున్నారు,

"ఉండండి ఉండండి నేను యిస్తాను నాచేతిలోనుండి లాక్కోవద్దు" అంటూ వెనక్కు నడిచింది అనూరాధ.

నాలుగు పేకెట్లు నాల్గుగు నిమిషా లలో పంచేసింది. వ్యానిటీ బ్యాగ్ దులుపు కుంటూ వెనక్కి తిరుగుతుండగా "అమ్మా నాకు" సన్నగా వినబడ్డది,

"అయ్యోబాబూ నిన్నే మర్చిపో యానా? ఎంతపొరబాటయింది?" నొచ్చు కుంటూ ఒక్క అంగలో కారుదగ్గరికివెళ్ళి తలుపుతెరచి బుట్టలోంచి రెండుసంత్రాలు తీసుకు వచ్చింది.

"వాళ్ళందరికీ ఒక్కొక్క బిస్కట్టే యిచ్చాను కాని నీకు రెండు కమలా ఫలాలు తెచ్చాను చూశావా?" అనూ రాధ అతడి బుగ్గలు నిమిరింది.

(సశేషం)